# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 132 | విశాఖపట్నం | 12-2-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 132 | VISAKHAPATNAM | 12-2-2026 THURSDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## అసెంబ్లీ నుంచి వైసీపీ సభ్యులు వాకౌట్..


# జగన్ నిరసన



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు మొదలు కాగానే.. వైసీపీ సభ్యులు నిరసనకు దిగారు. మాజీ సీఎం జగన్ తో సహా వైసీపీ సభ్యులు సభకు హాజరయ్యారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సభ్యుల ఉమ్మడి సమావేశంలో గవర్నర్ ప్రసంగించారు. ఆ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ సభ్యులు నిరసనకు దిగారు. నినాదాలు చేసారు. గవర్నర్ ప్రసంగం అడ్డుకునే ప్రయత్నం చేసారు. ఆ వెంటనే మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం అయ్యాయి. సభకు హాజరైన వైసీపీ సభ్యులు గవర్నర్ ప్రసంగం వేళ నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని నినాదాలు చేసారు. ప్రభుత్వ వ్యతిరేక స్లోగన్స్ ఇచ్చారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలని డిమాండ్ చేసారు. 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకొచ్చిన మార్పులు... పథకాల అమలు గురించి గవర్నర్ తన ప్రసంగంలో వివరించారు ఆ సమయంలో వైసీపీ సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. ప్రభుత్వం సాధించిన విజయాలను గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. అన్ని రంగాల్లో అద్భుత పాలన (తరువాయి 2వ పేజీలో)

## పునరుద్ధరణ దశ నుంచి

# ప్రగతి పథం వైపు అడుగులు



- రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.62 లక్షల కోట్లకు చేరిందని వెల్లడి
- తలసరి ఆదాయం రూ.2.95 లక్షలకు పెరిగిందని స్పష్టీకరణ
- గత ప్రభుత్వ పాలనపై 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని వెల్లడి
- బడ్జెట్ సమావేశంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

**అమరావతి, పతాకం న్యూస్:** 19 నెలలుగా కూటమి ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి పథం వైపు పయనిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గవర్నర్ ఇరు సభలనుద్దేశించి ప్రసంగించారు. గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ఏపీ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగునీటిపారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవి చూశాయన్నారు. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. "రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలు చవిచూశాయి. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి నాటి ప్రభుత్వం కృషి చేసింది. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు ఈ పురోగతికి విఘాతం కలిగించింది. తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది, వ్యవస్థలు విధ్వంసమయ్యాయి, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించి అరాచకత్వం ప్రబలింది. గత ప్రభుత్వంలో సెక్షన్ 22ఏ దుర్వినియోగం ద్వారా ఏకపక్ష ఆంక్షలు విధించారు" అని గవర్నర్ నజీర్ అన్నారు. రాష్ట్ర నీటిపారుదల వ్యవస్థకు వెన్నెముక వంటి పోలవరం ప్రాజెక్టును 2027, జూన్ లోపు పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం దీనికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని గవర్నర్ తెలిపారు. దీనిని ఆధారంగా చేసుకొని, కరువు పీడిత ప్రాంతాలకు త్వరితగతిన జలాలలు అందించాలని 'హంద్రీ-నీవా సుజల స్రవంతి' పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. గోదావరి జలాలను పోలవరం నుంచి వంశధార, ఆపై దక్షిణ నదీ వ్యవస్థలకు అనుసంధానించడానికి 'నల్లమల సాగర్' సహా నదుల అనుసంధాన కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. "విధానాలు, వ్యవస్థలు, వ్యయప్రాధాన్యతలలో కీలక సవరణలు చేశాం. దీర్ఘకాలిక దార్శనికతతో కూడిన పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే లక్ష్యంగా సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి 10 సూత్రాలు రూపొందించాం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశించిందని వివరించారు. 2047 నాటికి రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, రూ.55 లక్షల తలసరి ఆదాయం సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుంది" అని తెలిపారు.

"క్వాంటం టెక్నాలజీ ద్వారా అమరావతి గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు సంకల్పించింది. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నియంత్రణపై చట్టపరమైన విధివిధానాలు పరిశీలిస్తున్నాం. ఏపీ జీఎస్‌డీపీ రూ.15.91 లక్ష కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. దాదాపు 10.75 శాతం నామమాత్రపు వృద్ధి నమోదు చేసింది. 2027 గోదావరి పుష్కరాల కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం 25 కంటే ఎక్కువ నూతన విధానాలను ఆవిష్కరించింది. ట్రూడౌన్ విధానం ఫలితంగా యూనిట్‌కు 13 పైసల విద్యుత్ ఛార్జీ తగ్గింది" అని అన్నారు. (తరువాయి 2వ పేజీలో)

## అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు చేసిన గుంటూరు కోర్టు



**గుంటూరు, పతాకం న్యూస్:** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టులో ఊరట లభించింది. సీఐ విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో నమోదైన కేసులో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అదే సమయంలో, ఆయన్ను కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. గత ఏడాది నవంబర్ 12న ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది.

## మరో 15 ఏళ్లు మనం ఇలాగే

# బలంగా నిలబడాలి: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మరో 15 ఏళ్ల పాటు ఐక్యంగా, బలంగా కొనసాగాలని, అప్పుడే గుజరాత్ తరహాలో సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఏ స్ఫూర్తితో నిలబడ్డామో, అదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో పనిచేసి ఎమ్మెల్యేలు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కూటమిపై ప్రజా మద్దతు మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. "గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఐదుసార్లు గెలిచి అధికారంలో ఉంది. ఒకే ప్రభుత్వం (తరువాయి 2వ పేజీలో)



## డయాబెటిస్ వచ్చేందుకు చాలా ఏళ్ల ముందే ఈ లక్షణాలు కనిపిస్తాయి..!

6లో



5లో

## నత్తనడకన ఉప్పాడ ఫిషింగ్ హార్బర్



2లో

## కొడంగల్‌లో ఓటేసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH


## దేశాన్ని అమ్మేశారు.. అమెరికాతో ట్రేడ్ డీల్‌పై లోక్‌సభలో రాహుల్ గాంధీ



2లో

# గీతం కాలేజీకి కేటాయించిన బస్సులను రద్దు చేయాలి




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రజల రవాణా అవసరాలకు తగినట్లు ఆర్‌టిసి బస్సుల సంఖ్య పెంచాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభాకు తగినట్లు ఆర్‌టిసి బస్సుల సంఖ్య పెంచకపోవడంతో పేద, సాధారణ ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం జిల్లాలో 1760 అదనపు నూతన బస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన విశాఖ ఆర్‌టిసి రీజనల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం మహిళల అవసరాలకు తగినట్లు బస్సులు పెంచకపోవడంతో వ్యయప్రయాసలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 30 లక్షల జనాభా కలిగిన విశాఖ జిల్లాలో సగటున వెయ్యి మందికి ఒక ఆర్‌టిసి బస్సు ఉండాలనే నిబంధనను ప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రయాణికుల అవసరాలను పరిగణనలోకి తీసుకొని బస్సుల సంఖ్య పెంచాలన్నారు. ఒకవైపు సాధారణ ప్రయాణికులకు సరిపడా ఆర్‌టిసి బస్సులు నడపకపోగా, ఉన్న కొద్దిపాటి బస్సులను గీతంలాంటి కాలేజీలకు కేటాయించడం సరికాదన్నారు. ఆర్‌టిసి యాజమాన్యం తక్షణమే విశాఖ ఎంపీ శ్రీ భరత్‌కు చెందిన గీతం కాలేజీతో సహా ప్రైవేటు సంస్థలు, కాలేజీలకు కేటాయించిన బస్సులను రద్దు చేసి ప్రయాణికులకు వాటిని ఉపయోగించాలని కోరారు. బస్సు లేని ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని, నిలిపివేసిన ప్రాంతాలకు బస్సులను పునరుద్ధరించి ఆర్‌టిసి సేవలు విస్తరించాలన్నారు. ఆర్‌టిసిలో శాశ్వత ప్రతిపాదికన డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని నియమించి ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఐఎఫ్ఆర్‌కు ఏర్పాట్లు వేగవంతం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న మిలాన్-2026, ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలకు బీచ్‌రోడ్డులో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమైనది ఇంటర్నేషనల్ సిటీ పరేడ్. అన్ని దేశాల నౌకాదళ ప్రతినిధులతో 19వ తేదీ సాయంత్రం ఆర్‌కే బీచ్‌రోడ్డులో పరేడ్ నిర్వహించనున్నారు. సుమారు రెండు కి.మీ. పొడవున సాగే ఈ పరేడ్‌లో ఆయా దేశాలకు చెందిన సంస్కృతీ సంప్రదాయాలను ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమానికి వీక్షించడానికి మూడు లక్షల మంది ప్రజలు వస్తారనే అంచనాతో బీచ్‌రోడ్డులో గ్యాలరీలు, బారికేడ్లు ఏర్పాటుచేస్తున్నారు. బీచ్‌లో ముఖ్య అతిథుల కోసం ఒకవైపు, ప్రేక్షకుల కోసం మరోవైపు గ్యాలరీలు నిర్మిస్తున్నారు. నోవాటెల్‌లో అంతర్జాతీయ నేవీ సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## పలు ఆసుపత్రులను తనిఖీ చేసిన కలెక్టర్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ఆస్పత్రుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి, టీబీ అండ్ ఛాతీ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఆధునిక వైద్య పరికరాల వినియోగం గురించి ఆరా తీశారు. రోగులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో మాట్లాడిన కలెక్టర్ వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్యులు, సిబ్బంది బాధ్యాతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షిలు ఆస్పత్రిలో సౌకర్యాల గురించి వివరించారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలి



**మందస, పతాకం న్యూస్:** అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, సిబ్బంది సమయపాలన పాటించాలని మందస ఐసీడీఎస్ పీవో పి.అరుణ తెలిపారు. విధిగా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలు గు గంటలవరకు ఉండాలని పేర్కొన్నారు. మందస మండలంలోని మఖరజోల, హరిపురం, మందస అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ముచ్చటించి, రికార్డుల ను తనిఖీచేశారు. సిలబస్ ప్రకారం ప్రీస్కూల్‌లో చిన్నా రులకు బోధించాలని, మోనూప్రకారం పౌష్టికాహారం అందించాలని, పరిశరాలు పరిశభ్రంగా ఉంచాలని సూ చించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## 90శాతం పూర్తయిన షీలానగర్ ఈఎస్ఐ ఆసుపత్రి భవన నిర్మాణం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) షీలానగర్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణం చివరి దశకు చేరుకుంది. పదేళ్ల క్రితం అంటే 2016 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసుకున్న ఈ ఆస్పత్రి...ఇప్పుడు పూర్తి కావస్తోంది. ఇక్కడ మొదట మెడికల్ కళాశాలతో కూడిన ఆస్పత్రి ఏర్పాటు కోసం భూమి కేటాయించామని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కానీ భూ సమస్యల వల్ల అవసరమైనంత ఇవ్వలేదు. కేవలం 8.58 ఎకరాలు మాత్రమే ఇచ్చారు. దాంతో మెడికల్ కాలేజీని పక్కనపెట్టి కేవలం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రినే రూ.384.26 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. నిర్మాణ బాధ్యతలను సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ విభాగానికి అప్పగించారు. 2025 అక్టోబరు నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇంకా నడుస్తూనే ఉన్నాయి. 90 శాతం పూర్తయ్యాయి. ఇందులో 350 సాధారణ పడకలు, మరో 50 పడకలతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మించారు. ఇటీవల పనుల పరిశీలనకు వచ్చిన కేంద్ర కమిటీ అనుబంధంగా మెడికల్ కాలేజీ నిర్మిస్తామని ప్రకటించింది. దీనికి అవసరమైన భూమిని కేటాయించాలని కోరింది. బీజేపీ నాయకులు కూడా విజయవాడలో కూటమి నేతలతో చర్చించి, షీలానగర్‌లోనే మరో ఐదు ఎకరాలు కేటాయించాలని కోరారు. ప్రస్తుతం మల్కాపురంలో గల ఈఎస్ఐ ఆస్పత్రిలో అన్నిరకాల వైద్యసేవలు అందిస్తున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో 30 పడకలతో మరో ఆస్పత్రి నిర్మాణానికి ఈఎస్ఐ కార్పొరేషన్ అంగీకరించింది.

## డంపింగ్ యార్డు తరలించాలని రిలే దీక్ష



**గాజువాక, పతాకం న్యూస్:** జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్ గ్రామానికి ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని కోరుతూ డంపింగ్ యార్డు ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలనుద్దేశించి డంపింగ్ యార్డు పోరాట కమిటీ అడ్వైజర్లు మంత్రి శంకరనారాయణ, ఎం.రాంబాబు మాట్లాడుతూ, డంపింగ్ యార్డును ఇక్కడి నుండి తరలించే వరకు రిలే దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తంచేయకముందే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఇది ప్రజా ఉద్యమంగా మారుతుందన్నారు. గంగవరం పోర్టు కాలుష్యం విపరీతంగా ఉందని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు స్పందించి ఆ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు నారాయణరావు, డి.రమణ, జోత్స్న, జగదీష్, నాయుడు, ఎంకె.మూర్తి, రామచంద్రనగర్, రిక్షా కాలనీ, డెయిరీ కాలనీ, స్వతంత్ర నగర్, నవాజ్ అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

## గాజువాక అభివృద్ధికి కృషి

**గాజువాక, పతాకం న్యూస్:** పారిశ్రామిక ప్రాంతమైన గాజువాక జోన్ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ చెప్పారు. ఆయన గాజువాక క్లబ్‌లో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజుతో కలిసి గాజువాక జోన్ అభివృద్ధి, పలు సమస్యలపై జోన్ కార్పొరేటర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనవరి నుండి కొత్త జోనల్ కార్యాలయాలు పనులు ప్రారంభించాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జోన్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా కాంట్రాక్టర్లకు ఆదేశించామని చెప్పారు. గాజువాక నియోజకవర్గంలోని కార్పొరేటర్లు ఆయా వార్డుల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు మాట్లాడుతూ మంజూరైన పలు పనులను త్వరగా పూర్తి చేయాలని, గంగవరం మత్స్యకార ప్రజలకు నీటి కనెక్షన్లు కల్పించాలని, యారాడ బీచ్‌ను అభివృద్ధి పరిచి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, బిసి.రోడ్డులో ట్రాఫిక్ నేపథ్యంలో విస్తరణ పనులు చేపట్టాలని కోరారు.

## నేడు ఉక్కు కార్మికుల సమ్మె




**గాజువాక, పతాకం న్యూస్:** స్టీల్‌ప్లాంటు కార్మికులు శుక్రవారం సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్నారు. నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కార్మికవర్గం డిమాండ్ చేస్తోంది. నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. ప్లాంటులో ప్రస్తుతం సుమారు తొమ్మిది వేల మంది ఉద్యోగులు, మరో తొమ్మిది వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ఒకేసారి అంతా సమ్మె చేయనున్న నేపథ్యంలో యాజమాన్యం ప్రత్యామ్నాయంపై ప్రణాళిక సిద్ధం చేసింది. సమ్మె విరమించుకోవాలని ముందుగా కార్మిక సంఘాలను కోరింది. దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని కార్మిక సంఘాలు స్పష్టం చేయడంతో ఎగ్జిక్యూటివ్‌లంతా 12 గంటల చొప్పున విధులు నిర్వర్తించాలని ఆదేశించింది.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవి:** ఉత్పత్తి ఆధారిత వేతనాలపై ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి. పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలి. నిలిపివేసిన హెచ్‌ఆర్‌ఏ, ఈఎల్ పునరుద్ధరించాలి. టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసితులకు విద్యుత్ చార్జీలు తగ్గించాలి. కార్మికులకు 15 సీఎల్స్ ఇవ్వాలి. గ్రాట్యుటీ రూ.25 లక్షలకు పెంచాలి. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి. ఈవోఐ టెండర్లను రద్దుచేయాలి. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి. నిర్వాసిత నిరుద్యోగులకు న్యాయం చేయాలి. అధికారులకు 12 గంటల డ్యూటీ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఒకరోజు సమ్మెకు పిలుపునివ్వడంతో అధికారులు గురువారం 12 గంటల చొప్పున విధులు నిర్వహించాలని ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులు ఇచ్చింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఒక షిఫ్ట్, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు మరో షిఫ్ట్‌గా ప్రకటించింది. ముఖ్యమైన విభాగాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## 308 కిలోల గంజాయి స్వాధీనం



**చింతపల్లి, పతాకం న్యూస్:** మండలంలోని కోటగున్నలు గ్రామంలో పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేయడానికి సిద్ధం చేసిన 308 కిలోల గంజాయిని అన్నవరం పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తెలిపారు. చింతపల్లి పోలీసు కార్యాలయంలో దీనికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. నర్సీపట్నం నీలంపేటకు చెందిన అడుగుల ప్రకాశ్‌కుమార్ గంజాయి రవాణలో కీలక పాత్ర పోషిస్తున్నాడన్నారు. గంజాయిని సేకరించి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటాడని తెలిపారు. కోటగున్నల గ్రామానికి చెందిన పాంగి చంటి, వంతల నగేశ్‌లు ఒడిశా నుంచి గంజాయిని సేకరించి కోటగున్నలు గ్రామానికి తీసుకొస్తుంటే అడుగుల ప్రకాశ్‌కుమార్ అదును చూసి పొరుగు రాష్ట్రాల స్మగ్లర్లకు ఎగుమతి చేస్తుంటాడని తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం కోటగున్నలు గ్రామానికి చెందిన చంటి, నగేశ్‌లు ఒడిశా రాష్ట్రం చిత్రకొండ బ్లాక్ పరిధి దగుపల్లి గ్రామంలో ముగ్గురు వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేశారన్నారు. గంజాయిని ఒడిశా నుంచి తరలించేందుకు వాగు దాటాల్సిన పరిస్థితి ఏర్పడడంతో జుర్రెల మీదుగా కోటగున్నలు గ్రామానికి తీసుకొచ్చారన్నారు. ఈ విషయం తెలుసుకున్న అన్నవరం ఎస్ఐ సాయిరామ్, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారని చెప్పారు. చంటి, నగేశ్‌లు గంజాయి బస్తాలను విడిచి పెట్టి ద్విచక్ర వాహనాలపై పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకున్నారన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించి ఆరుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. గంజాయితో పట్టుబడిన ఏ1 చంటి, ఏ2 నగేశ్‌ను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఏ3 అడుగుల ప్రకాశ్ కుమార్‌తో పాటు ఒడిశాలో గంజాయి విక్రయించిన ఏ4, ఏ5, ఏ6లు పరారీలో ఉన్నారన్నారు. ఈ గంజాయి రవాణాలో ప్రధాన భూమిక పోషిస్తున్న అడుగుల ప్రకాశ్‌కుమార్ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం.వినోద్‌బాబు, స్థానిక ఎస్ఐలు జి.రాంబాబు, ఎం.వెంకట రమణ, అన్నవరం ఎస్ఐ బి. సాయిరామ్ పాల్గొన్నారు.

## ఈపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఈపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఎఫ్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కెఎం.కుమార మంగళం అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణ, జింక్ నాయకులు కనకేశ్వరరావు, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్, సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్, స్టీల్ ప్లాంట్ నాయకులు డిసిహెచ్ వెంకటేశ్వరరావు, అప్పలరాజు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, తగరపువలస బాబాజీ, తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మొద్దు నిద్ర నటించడం మాని ఇపిఎస్ 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలన్నారు. రైలు ప్రయాణ కన్సెషన్ సదుపాయం సీనియర్ సిటిజన్లకు పునరుద్ధరించాలని కోరారు. మోడీ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అన్యాయం చేస్తుందని, పెన్షనర్లు, కార్మికులు, రైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## శరవేగంగా ప్రైవేటు స్టీల్ ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్కుకు మౌలిక సదుపాయాల పనులు



**నక్కపల్లి, పతాకం న్యూస్:** విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలో సేకరించిన భూముల్లో ప్రైవేటు స్టీల్ ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్కుకు మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. స్టీల్ ఉత్పత్తిలో దిగ్గజ సంస్థలైన ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కంపెనీలు ఇక్కడ సుమారు లక్షన్నర కోట్ల రూపాయల వ్యయంతో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. ఈ కంపెనీకి కేటాయించిన భూముల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, విద్యుత్ లైన్లఏర్పాటు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలో సేకరించిన సుమారు 4,500 ఎకరాల్లో అనేక పరిశ్రమలు ఏర్పాటుకానున్న విషయం తెలిసిందే. ఇందులో బుచ్చిరాజుపేట, చందనాడ, డీఎల్‌పురం, రాజయ్యపేట, వేంపాడు తదితర గ్రామాల పరిధిలో 2,164.31 ఎకరాల భూములను ప్రభుత్వం 'ఆర్సెలార్ మిట్టల్- నిప్పన్ స్టీల్ ఇండియా కార్పొరేషన్'కు కేటాయించింది. బల్క్‌డ్రగ్ పార్కుకు సుమారు 1,500 ఎకరాలు కేటాయించింది. ఈ రెండింటికి కేటాయించిన భూముల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాజయ్యపేట నుంచి బోయపాడు మీదుగా సుమారు 100 అడుగుల వెడల్పుతో బీటీ రహదారి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 15.52 కి.మీ. నుంచి 16.2 కి.మీ. వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రెండు కిలోమీటర్ల మేర డ్రైనేజీ కాలువల నిర్మాణం కూడా పూర్తయ్యింది. ఏపీఐఐసీ పరిపాలన భవనం నిర్మాణ పనులు 80 శాతం మేర పూర్తయ్యాయి. 2,700 కేఎల్ సామర్థ్యగల ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు 80 శాతం, బోయపాడు, రాజయ్యపేట గ్రామాలకు ఆనుకుని పైప్‌లైన్ నిర్మాణ పనులు 75 శాతం మేర పూర్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ అవసరాల కోసం నాతవరం మండలం ఎంబీపట్నం వద్ద ఏలేరు కాలువ నుంచి నీటిని సరఫరా చేసేందుకు 1100 మి.మీ. వ్యాసార్థగల పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ముడిసరుకు రవాణా, వాహనాల రాకపోకలకు, స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి నీటి వనరుల సమీకరణ తదితర విభాగాలకు సంబంధించి పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి.

## తప్పులులేని పాసు పుస్తకాలు ఇవ్వాలి



**శృంగవరపుకోట, పతాకం న్యూస్:** రైతులకు తప్పులు లేని పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాల ని జేసీ సేతుమాధవన్ రెవెన్యూ అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. మండల పరిధిలోని పెద ఖండేపల్లి, అలుగుబిల్లి, చీడిపాలెం, విశ్వనాథపురం, జెడ్.ముకుందాపురం గ్రామాలకు చెందిన రికార్డులను తహసీల్దార్ డి.శ్రీనివాసరావుతో కలసి తనిఖీ చేశారు. వ్యక్తిగత వివరాలన్నీ సక్రమంగా నమోదు చేస్తున్నారా.. లేదా.. అంటూ ఆయా గ్రామాలకు చెందిన రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. కంప్యూటర్ ఆపరేటర్ సూరిబాబు దగ్గర కూర్చొని.. రైతుల ఖాతా నెంబర్ల వారిగా వ్యక్తిగత, భూ వివరాలను పరిశీలించారు. పనితీరు బాగుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశించిన గడువు లోపల రీసర్వే జరిగిన తప్పులను సరిదిద్దాలని ఆదేశించారు. డీటీ రంజిత్‌కుమార్, ఆర్ఐ, ఆర్ఎస్ డీటీ పాల్గొన్నారు. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో పంపి ణీ చేస్తున్న పాసు పుస్తకాల్లో తప్పులు లేకుండా చూడా లని ఆర్డీవో కీర్తి సూచించారు. ఆమె గంట్యాడ తహసీల్దా ర్ కార్యాలయాన్ని సందర్శించారు. పట్టాదారు పాసు పుస్తకాల్లో ఉన్న తప్పులను ఎలా సరి చేస్తున్నారు.. అనే దానిపై ఆరా తీశారు. తప్పులు ఉన్న వాటిని సరిచేసి, కొత్తగా ముద్రించి రైతులకు పంపిణీ చేయాలన్నారు. మార్చి నెలలో పెంటశ్రీరాంపురం, రేగుబిల్లి, వైఎస్ఆర్ పురం గ్రామాలకు చెందిన 2,197 పట్టాదారు పాసు పుస్తకాల సవరణపై పర్యవేక్షించాల న్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, రీసర్వే డీటీ నాగలక్ష్మి, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

## రైతులకు భరోసా కల్పించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** రైతులకు మార్కెట్ సదుపాయం ఉందన్న భరోసా కల్పించినప్పుడే ఉద్యాన మిషన్ విజయవంతం అవుతుందని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అన్నారు. ఉద్యాన మిషన్‌పై ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉద్యాన మిషన్ కింద జిల్లాలో ఈ ఏడాది పదివేల ఎకరాల్లో అదనంగా ఉద్యాన పంటలను సాగు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే సుమారు 3,300 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరిగిందని చెప్పారు. మరో 700 ఎకరాల్లో చేయాల్సి ఉందన్నారు. కూరగా యలు, కోకో, ఆకుకూరలు, బొప్పాయి వంటి పంటలతో పాటు సుమారు 30ఏళ్ల పాటు ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పామ్ వంటి పంటల సాగు వైపు మళ్లిం చాలన్నారు. 180 మీటర్ల లోపు విద్యుత్ సరఫరా ఉన్న రైతుల జాబితాలను విద్యుత్ శాఖకు ఇచ్చి వెంటనే క్షేత్ర పరిశీలన చేయించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, ఉద్యాన శాఖ డీడీ చిట్టిరాజు, వ్యవసాయ శాఖ జేడీ రామారావు ఉన్నారు.

# నేడు విజయవాడలో ఆటోల బంద్.. జేఏసీ పిలుపు




**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ నగరంలో గురువారం ఆటోలు బంద్ నిర్వహించనున్నట్లు ఆటో జేఏసీ ప్రకటించింది. తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ నేతలు తెలిపారు. జీవో నంబర్ 21తో పాటు బిఎన్ఎస్ 106 (1), (2)లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిబంధనల వల్ల ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మరోవైపు.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన "స్త్రీశక్తి" స్కీమ్.. అమలు కారణంగా ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతింటోందని ఆరోపిస్తూ, నష్టపోయిన ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.25,000 నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. ఇక, ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ యాప్‌లకు బదులుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా మధ్యవర్తుల దోపిడీ తగ్గి డ్రైవర్లకు నేరుగా లాభం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## వినూత్న రీతిలో పసుపు ఉత్పత్తి చేస్తున్న ఆదివాసీ రైతులు




**చింతపల్లి, పతాకం న్యూస్:** ఆదివాసీ రైతులు వినూత్న పద్ధతిలో పసుపు ఉత్పత్తి చేస్తున్నారు. థింసా ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సంఘం సహకారంతో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ స్లైసింగ్ రూపంలో పసుపును తయారు చేస్తున్నారు. ఈ విధానం వల్ల కూలీలు, వంట చెరకు ఖర్చులను రైతులు ఆదా చేసుకుంటున్నారు. అలాగే స్లైసింగ్ పద్ధతిలో ఉత్పత్తి చేసిన పసుపునకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుంది. గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు కొన్నేళ్లుగా సుగంధ ద్రవ్య పంటగా పసుపును సాగు చేస్తున్నారు. ఏజెన్సీ పదకొండు మండలాల్లో 25 వేల ఎకరాల్లో ఆదివాసీ రైతులు పసుపు పంటను సాగు చేస్తున్నారు. ఎకరానికి పచ్చి పసుపు 4.5 నుంచి 5 టన్నులు దిగుబడి వస్తుంది. గిరిజన రైతులు పసుపును రెండేళ్ల పంటగా సాగు చేస్తున్నారు. ఈ విధానం వల్ల సమయం వృథా కావడంతో పాటు రైతులు తక్కువ ఆదాయం పొందుతున్నారు. శాస్త్రవేత్తలు 8 నుంచి 9 నెలల కాలంలో పండించే పసుపు వంగడాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. తక్కువ మంది రైతులు రోమా పసుపును తొమ్మిది నెలల పంటగా సాగు చేస్తున్నారు. గిరిజన రైతులు కొన్నేళ్లుగా ఉడికించే పద్ధతి ద్వారా ఎండు పసుపును ఉత్పత్తి చేస్తున్నారు. పంట పొలం నుంచి సేకరించిన పచ్చి పసుపును ఆవిరిలో ఉడికించి ఎండబెడుతున్నారు. పసుపు ఎండిన తరువాత యంత్రాలు, సంప్రదాయ వస్తువులతో ఆదివాసీ రైతులు పాలిష్ చేస్తున్నారు. పసుపును ఆవిరిలో ఉడికించేందుకు అధిక మొత్తంలో వంట చెరకుతో పాటు కూలీలు అవసరం. రైతులు ఎండు పసుపుగా ఉత్పత్తి చేసేందుకు అధికంగా శ్రమించాల్సి వస్తుంది. ఈ విధంగా ఉత్పత్తి చేసిన ఎండు పుసుపును రైతులు మార్కెటింగ్ చేసుకుంటున్నారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు పండించిన పసుపులో కుర్కుమిన్ శాతం అధికంగా ఉంటుంది. దీంతో జాతీయ మార్కెట్‌లో ఈ పసుపునకు మంచి డిమాండ్ ఉంది. గత ఏడాది మార్కెట్ ప్రారంభంలో కిలో రూ.90 ధర లభించగా, నెల రోజుల వ్యవధిలోనే రూ.140 ధర లభించింది. ప్రతి ఏడాది పసుపు ధర పెరుగుతుండడంతో ఆదివాసీ రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. కొంత మంది రైతులు ఎండు పసుపు ఉత్పత్తి వంట చెరకు, కూలీల కొరత వల్ల తక్కువ ధరకు పచ్చి పసుపును విక్రయించుకుంటున్నారు. థింసా ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సంఘం గిరిజన రైతులకు స్లైసింగ్ పద్ధతిలో ఎండు పసుపు ఉత్పత్తి చేయడాన్ని పరిచయం చేసింది. ఈ విధానంలో వంట చెరకు అవసరం లేకపోవడం వల్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. గిరిజనులు పంట పొలం నుంచి సేకరించిన పసుపును శుభ్రం చేసుకుని కొమ్ములను స్లైస్ రూపంలో కట్ చేసుకోవాలి. ఒక్కొక్క పసుపు కొమ్ము పరిమాణం ఆధారంగా నాలుగు, ఆరు స్లైస్(బద్దలు)గా చేసుకోవాలి. ఈ విధంగా స్లైస్ చేసుకున్న పసుపు ముక్కలను సిమెంట్ కల్లాలు, టార్పాలిన్లపైన ఎండబెట్టుకోవాలి. బాగా ఎండిన పసుపును నేరుగా విక్రయించుకోవచ్చు. స్లైసింగ్ పద్ధతిలో ఉత్పత్తి చేసిన పసుపును పాలిష్ చేయాల్సిన అవసరం లేదు. ఆవిరి రూపంలో ఉడికించిన పసుపు మూడు కిలోలు ఎండిన తరువాత ఒక కిలో వస్తుంది. స్లైసింగ్ పద్ధతిలో 3.5 కిలోల పసుపు ఒక కిలో ఎండు పసుపు వస్తుంది. స్లైసింగ్ పద్ధతిలో వంట చెరకు అవసరం ఉండదు. పాలిష్ చేయాల్సిన అవసరం ఉండదు. స్లైసింగ్ రూపంలో ఉత్పత్తి చేసిన ఎండు పసుపునకు మార్కెట్‌లో కిలో రూ.160 ధర లభిస్తున్నది. ఆవిరి ద్వారా ఉడికించి ఎండబెట్టిన పసుపు కంటే స్లైసింగ్ ద్వారా ఉత్పత్తి చేసిన పసుపునకు రూ.20 అధిక ధర లభిస్తుందని థింసా ఆర్గానిక్ ఎఫ్‌పీవో ప్రతినిధులు తెలిపారు.

### జగన్ అవకాశం ఇవ్వకపోతే... సొంతంగా పోటీచేసి

## నా బలం చూపిస్తా: దువ్వాడ శ్రీనివాస్



**అమరావతి, పతాకం న్యూస్:** 'వైసీపీ నుంచి జగన్ అవకాశం ఇవ్వకపోతే... సొంతగా పోటీ చేసి నా బలం చూపిస్తా' అంటూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. శాసన మండలిలో తన వాణి వినిపిస్తానని చెప్పారు. త్వరలోనే జగన్‌ను కలుస్తానని ఆయన పేర్కొన్నారు. టీటీడీ లడ్డూ వ్యవహారంలో భక్తుడి వైపు మాట్లాడతానని దువ్వాడ వ్యాఖ్యా నించారు. అలాగే మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నిర్మించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. అంతకముందు.. అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను పిలిచి మాట్లాడారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. ఈ సందర్భంగా జగన్ కాళ్లకు మొక్కారు దువ్వాడ. 'ఏం చేద్దామనుకుంటున్నావ్ శ్రీనివాస్?' అని దువ్వాడను జగన్ పలకరించగా.. ధర్మాన ప్రసాదరావుతో ఉన్న అంశాలపై మాట్లాడాలని తెలిపారు ఎమ్మెల్సీ. దీనిపై 'ఒకసారి కలవమని' చెప్పి వెళ్లిపోయారు జగన్. ఈ భేటీ దువ్వాడ భవిష్యత్తు రాజకీయాలపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. జగన్‌తో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం, పార్టీలో చేరే అవకాశాలు, సొంతంగా పోటీ చేయడం తదితర అంశాలు చర్చనీయాంశంగా మారాయి.

## ఘనంగా శంబరలో పోలమాంబ మూడోవారం జాతర



**విజయనగరం, పతాకం న్యూస్:** శంబరలో పోలమాంబ మూడోవారం జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భారీగా భక్తజనం తరలివచ్చి.. అమ్మవారి దర్శ నానికి బారులుదీరారు. దీంతో వనం, చదురు గుడుల ఆవరణలో క్యూలైన్లు ఉదయం తొమ్మిది గంటల నుంచే కిటకిటలాడాయి. గంటల కొద్దీ నిరీక్షించిన అనంతరం పోలమాంబను దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. వనంగుడి పక్కన ఉన్న అమ్మవారి వేపచెట్టుకు మహి ళలు పెద్దఎత్తున పూజలు జరిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసనాయుడు తదితరులు పోలమాంబను దర్శించుకున్నారు. దేవదాయ శాఖ 7,500 లడ్డూలను సిద్ధం చేయగా.. భక్తులకు ఉచితప్రసాదం కూడా పంపిణీ చేశారు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాలూరు సీఐ పి.రామకృష్ణ, మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో 170 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## ప్రజా సమస్యలు పక్కదారి పట్టించడానికే లడ్డు వివాదం



**విజయవాడ, పతాకం న్యూస్:** తిరుపతి లడ్డూ తయారీలో వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన సిట్ నివేదికను వెంటనే బహిరంగపరచి, అవినీతికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కల్తీ నెయ్యి కొనుగోలులో జరిగిన అక్రమాలు, కోట్ల రూపాయల అవినీతిపై వేసిన 'సిట్' నివేదిక వెల్లడించి, నిజాలను ప్రజలకు తెలపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని వామపక్ష పార్టీలు కోరాయి. ఈరోజు విజయవాడలో జరిగిన వామపక్ష పార్టీల సమావేశానికి సిపిఐ(యం), సిపిఐ సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(యంఎల్) లిబరేషన్ ఆర్ఎస్‌పి ఫార్వర్డ్‌బ్లాక్ యంసిపిఐ(యు), ఎస్‌యుసిఐ(సి), సిపిఐ(యంఎల్)న్యూడెమోక్రసీ సిపిఐ(యంఎల్) నేతలు హాజరయ్యారు. సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. రాజకీయ ప్రయోజనాల కోసం భక్తుల మనోభావాలతో చెలగాటమాడవద్దని హెచ్చరించాయి. ప్రజల మధ్య మత విద్వేషాలను పెంచే పాలక, ప్రతిపక్ష పార్టీల చర్యలను ప్రజలు వ్యతిరేకించాలని, లడ్డు వివాదాన్ని మత విశ్వాసాల మధ్య ఘర్షణలుగా మార్చడాన్ని వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశాయి. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే వాటిని పట్టించుకోకుండా ఆ వైఫల్యాలను కప్పెట్టుకోడానికే లడ్డు వివాదాన్ని వాడుకొని ప్రజల్ని మతాల ఆధారంగా చీలుస్తున్నారని వారు మండిపడ్డారు. గతంలో విజయ డైరీ అతి పెద్ద సంస్థగా ఉండగా దాన్ని చీల్చి బలహీనపరిచి ప్రయివేటు డైరీలను ప్రోత్సహించారని తెలిపారు. ఇప్పుడవే అవినీతికి పాల్పడి దోచుకుంటున్నాయని పేర్కొన్నారు.లడ్డులో జరిగిన కల్తీపై సిట్ ఏమి చెప్పిందో అధికారికంగా వెల్లడించకుండానే టిడిపి, జనసేన, బిజెపి కూటమి మరియు వైఎస్సార్ పార్టీలు తమకు తోచిన విధంగా తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా భాష్యాలు చెప్పి నిజాలను సమాధి చేస్తున్నాయని ఆగ్రహించారు. లడ్డు కల్తీపై కూటమి పార్టీలే తలోమాట చెప్తున్నాయని, బిజెపి నాయకులు దాన్ని సింథటిక్ నెయ్యి అని, జనసేన నాయకులు నెయ్యి కాని నెయ్యి అని, మరికొందరు రసాయనాలు కలిశాయని తలొరకంగా తిప్పి తిప్పి మాట్లాడుతూ ప్రజల్ని గందరగోళపరుస్తున్నారని పేర్కొన్నారు. అసలు నిజాలను మరుగు పరుస్తున్నారని పేర్కొన్నారు. ఆఖరికి సిట్ నివేదికను సైతం తప్పు పడుతున్నాయని, సుప్రీం కోర్టు ఆదేశంపై సిట్‌ను కేంద్ర ప్రభుత్వమే నియమించిందని పేర్కొన్నారు. వారు ముగ్గురు టిటిడి అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోమని సిఫార్సు చేస్తే వారిని ట్రాన్స్‌ఫర్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. కారణమేమిటో రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని, అవినీతికి పాల్పడ్డారని సిట్ నివేదిక చెప్పినా ప్రభుత్వం ఎందుకు చర్య తీసుకోలేదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. లడ్డు వ్యవహారంతో గతం నుండి బిజెపి నాయకుల భాగస్వామ్యం ఉందని, వారు మాట్లాడడం లేదన్నారు. వారి భాగోతాలు బయటపడకుండా ఉండటానికే అందరూ కలిసి అసలు దోషులను కాపాడుతున్నారని ఆగ్రహించారు.

## విద్యార్థుల కిడ్నాప్‌లో మోహన్‌బాబు పాత్ర




**అమరావతి, పతాకం న్యూస్:** ఎస్ఎఫ్ఐ నాయకుల కిడ్నాప్‌లో మంచు మోహన్‌బాబు పాత్ర ఉందని ప్రాథమిక ఆధారాలు న్నాయని అదనపు పిపి హైకోర్టుకు తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకులను కిడ్నాప్ చేశారంటూ తనపై తిరుచానూరు పిఎస్‌లో నమోదైన కేసును కొట్టేయాలని, తదుపరి చర్యలు నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు యూని వర్సిటీ ఛాన్సలర్ మోహన్ బాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారించారు. ఎస్ఎఫ్ఐ నాయకుల తరపున న్యాయవాది నల్లూరి మాధవరావు ప్రతివాదన చేస్తూ, యూనివర్సిటీలో విద్యార్థులకు జరిగిన అన్యాయం గురించి అడిగినందుకు కిడ్నాప్ చేశారన్నారు. పిటిషనర్ల అభ్యర్థనను తిరస్కరిం చాలని కోరారు. పోలీసుల తరపున అదనపు పిపి వాదనలు వినిపిస్తూ.. కేసు ప్రాథమిక దర్యాప్తులో ఉందన్నారు. ప్రధాన నిందితుడితో మోహన్‌బాబు ఫోన్ చేయించార న్నారు. అరెస్టు నుంచి రక్షణ కల్పించొద్దని కోరారు. బాధితుల వాదనలు వినాల్సి వుందని, అప్పటివరకు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వబోమని చెప్పిన హైకోర్టు విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది.

## కేబుల్ వైర్ మెడకు తగిలి.. బైక్ నుంచి కిందపడి ప్రధానోపాధ్యాయుడు మృతి



**చీరాల, పతాకం న్యూస్:** కేబుల్ సిబ్బంది నిర్లక్ష్యం.. ఓ ప్రధానోపాధ్యాయుడి ప్రాణాలను బలి తీసుకుంది. రోడ్డుకు అడ్డంగా వేలాడిన కేబుల్ బైక్‌పై వెళ్తున్న ఆయన మెడకు చుట్టుకోవడంతో కిందపడి ప్రాణాలు కోల్పోయారు. బాపట్ల జిల్లా, చీరాల మండలం గవినివారిపాలెం సమీపంలో మంగళవారం దుర్ఘటన చోటుచేసుకొంది. పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన అంగిరేకుల శ్రీనివాసరావు (58) గవినివారిపాలెం జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. బాపట్లలో స్థిరపడిన ఆయన నిత్యం ద్విచక్రవాహనంపై గవినివానిపాలేనికి వచ్చి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరారు. 8:45 సమయంలో దేవినూతల-గవినివారిపాలెం మధ్య రోడ్డుకు అడ్డంగా గాలిలో వేలాడుతున్న ఏపీ ఫైబర్ కేబుల్ ఆయన మెడకు చుట్టుకుంది. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధ్యులపై కేసు నమోదు చేశారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆకస్మిక మరణంతో చిన్నారులు, ఉపాధ్యాయులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. గ్రామాల్లో అనేకచోట్ల కేబుల్స్ రోడ్లకు అడ్డంగా వేలాడుతున్నాయని, వాటిని పర్యవేక్షించాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డాయి.

## టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



**గూడూరు, పతాకం న్యూస్:** పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ సుధాకర్ అన్నారు. గూడూరులోని ఇంటిగ్రే టెడ్ బాలురు వసతి గృహంలో పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం డివి జనల్ స్థాయిలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించేందుకు అవసర మైన ఏర్పాట్లను డీఈవో, డిప్యూటీ డీఈవో శ్రీధర్ బాబు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం 30 రోజుల యాక్షన ప్లాన డివిజనల్ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. డివిజనల్ స్థాయిలోని 8 మండ లాల్లోని 79 మంది విద్యార్థులకు గూడూరులోని ఇంటిగ్రేటేడ్ బాలురు వసతి గృహం, కస్తూర్బా పాఠశాలలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వ హించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఆయన వెంట ఎంఈవో సునీలమ్మ, ఎంఈవో-2 నాగరాజు, హాస్టల్ వార్డెన వలి ఉన్నారు.

## కొబ్బరి పీచు పరిశ్రమతో మహిళలకు ఉపాధి

**లావేరు, పతాకం న్యూస్:**దేశంలో కొబ్బరి పీచు పరిశ్రమతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని కోయర్ బోర్డు ప్రాంతీయ అధికారి (రాజమండ్రి) శిబూ లాల్ అన్నారు. లావేరులోని శ్రీ లక్ష్మి కోయర్ వెల్ఫేర్ సొసైటీ సొసైటీ ఆధ్వ ర్యంలో కొబ్బరి పీచు పరిశ్రమపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పీఎంఈజీపీ పథకం కింద రుణ సదు పాయాన్ని కల్పిస్తోందన్నారు. గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళ లకు 35 శాతం, ఇతరులకు 25 శాతం రాయితీ అందిస్తోం దని చెప్పారు. రాష్ట్రంలో 1000 వరకు కోయర్ బోర్డు ద్వారా కొబ్బరి పీచు పరిశ్రమలున్నాయని చెప్పారు. కొబ్బరి పీచుతో తయారు చేసిన 3,800 కొబ్బరి ఉత్పత్తులు ఏటా 121 దేశాలకు ఎగుమతులు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏవో డి.మహేష్ నాయుడు, ఏపీ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నాగరాజు, ఏఈవో బగాది ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన ఉప్పాడ ఫిషింగ్ హార్బర్



**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ శివారు అమీనాబాద్ తీరంలో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు చేపట్టి నాలుగున్నరేళ్లు కావస్తున్నా పూర్తికావడం లేదు. నిధుల విడుదల్లో తీవ్ర జాప్యం, వరుస తుపానుల కారణంగా హార్బర్ పనులు నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మత్స్యకారుల జీవనోపాధిని మరింతగా మెరుగుపరిచేందుకు రూ.351 కోట్లతో హార్బర్ నిర్మాణానికి 2020 డిసెంబరులో అప్పటి సిఎం జగన్ శంకుస్థాపన చేశారు. 2021 జూన్‌లో ఎపి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ పర్యవేక్షణలో ఎంఆర్ కెఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండిస్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పనులు ప్రారంభించింది. 2023 జూన్ నాటికే పనులు పూర్తి కావాల్సి ఉంది. కాని నేటికీ పూర్తి కాలేదు. నిధుల విడుదలలో జాప్యం, వరుస తుపానుల కారణంగా పూర్తి కాలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీంతో 2024 మార్చి నాటికే కచ్చితంగా పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టు సంస్థ చెప్పినప్పటికీ, పూర్తిచేయలేదు. ఇప్పటి వరకూ రూ.290 కోట్ల మేర పనులను నిర్వహించారు. దీనికి సంబంధించి ఇప్పటి వరకూ 168 కోట్ల బిల్లులు మంజూరు చేశారు. మిగిలిన నిధులు ఇంకా విడుదల కాలేదు.

ఐదు నెలల కాలంలో హార్బర్ పనులను పూర్తి చేసి, బెర్త్‌లను మత్స్యకారులకు అంకితం చేస్తామని గతేడాది ఏప్రిల్ 25న కాకినాడ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్ రెడ్డి అన్నారు. మంత్రి హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. గత వైసిపి పాలనా కాలంలో పరిస్థితికి, రెండేళ్ల కూటమి హయాంలో పరిస్థితికి పెద్దగా మార్పు లేదని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రభుత్వం తక్షణమే పనులు పూర్తి చేయడానికి నిధులు విడుదల చేసి హార్బర్‌ను పూర్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

కాకినాడ జిల్లాలో ఐదు తీరప్రాంత మండలాలుండగా, 36 మత్స్యకార గ్రామాలున్నాయి. సుమారు రెండు లక్షల మంది మత్స్యకారులు ఉన్నారు. దాదాపుగా అందరూ చేపల వేట ద్వారానే జీవనోపాధి పొందుతున్నారు. 467 మెకనైజ్డ్ బోట్లు, 3,780 మోటారు బోట్లు, 400 సంప్రదాయ బోట్లు ఉన్నాయి. ఒకేసారి 2,500 బోట్లు నిలుపుకునే సామర్థ్యంతో 58 ఎకరాల్లో ఈ హార్బర్‌ను నిర్మిస్తున్నారు.

భారీ బోట్లు నిలుపగలిగేలా నిర్మాణం చేపడుతున్నారు. 20 టన్నుల కెపాసిటీ గల శీతల గిడ్డంగులు, భారీ ట్యూనా చేపల ఫిష్ హ్యాండ్లింగ్ ప్యాకింగ్ షెడ్లు, కోల్డ్ స్టోరేజ్లు, పెట్రోల్ బంకు, జెట్టీలు, వేలం ప్రాంగణం, చేపలు ఎండబెట్టుకునే యార్డు, ప్యాకింగ్ షెడ్లు, మత్స్యకారులకు శిక్షణా కేంద్రం, వలలు అల్లుకునే షెడ్లు, ఐస్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్నాయి. యు.కొత్తపల్లి, తొండంగి, కాకినాడ రూరల్ మండలాలకు చెందిన దాదాపు 2,500 మత్స్యకార కుటుంబాలు దీని ద్వారా ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. ఏటా 30 వేల టన్నుల నుంచి 1.10 లక్షల టన్నులకు మత్స్య ఉత్పత్తి పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# నాగావళి నదిలో ఇసుక తవ్వకాలతో ఇబ్బందులు!

**పాలకొండ, పతాకం న్యూస్:** పాలకొండ మండలంలోని నాగావళి నదిలో ఇసుక తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఏ మేరకు ఇసుక నిల్వలు ఉన్నాయో పరిశీలించకుండా.. ప్రజాప్రతినిధుల సిఫారసులకు తలొగ్గి.. ఎడాపెడా అధికార యంత్రాంగం అనుమతులు మంజూరు చేస్తుండడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. దీంతో ఓపెన్‌హెడ్ చానల్ ద్వారా సాగునీరు, ఇన్‌ఫిల్టర్ బావుల ద్వారా తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. పాలకొండ మండలం గొట్ట మంగళాపురం, గోపాలపురం వద్ద నాగావళి నదిలో ఇసుక తవ్వకాలకు ఇటీవల మన్యం జిల్లా అధికార యంత్రాంగం అనుమతులు మంజూరు చేసింది. ఆరు నెలల కిందటే నాగావళి నదికి అవతల ఉన్న బొడ్డవలస వద్ద విజయనగరం జిల్లా అధికారులు ఇసుక నిల్వలు తరలింపునకు అనుమతులు మంజూరు చేశారు. దీంతో రాత్రి, పగలని తేడా లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతుండడంతో నది లోతుగా మారుతోంది. కాగా పాల కొండ మండలం యరకారాయపురం నుంచి గోపాలపురంవరకు వెంకన్న , సీడీ నాయుడు , సాయన్న తదితర ఓపెన్‌హెడ్ చానళ్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 20 నుంచి 30 గ్రామాలకు సాగునీరు సరఫరా కావాల్సి ఉంది. అయితే బొడ్డవలస వద్ద గత ఆరు నెలలుగా ఇసుక తవ్వకాలు కొనసాగుతుండడంతో నదిలో ఇసుక గణనీయంగా తగ్గి ఓపెన్‌హెడ్ చానళ్లకు సాగునీరందడం లేదు.

గడిచిన పది రోజులుగా సీడీనాయుడు చానల్ ద్వారా రబీ పంటకు అవసరమైన సాగునీటిను తరలించేందుకు రైతులు ఎకరాకు రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. యరకారాయపురం వద్ద ఉన్న సీడీ నాయుడు చానల్ ఓపెన్‌హెడ్ ఎత్తుగా మారడం, ఇసుక తవ్వకాలతో కింది భాగంలో జారి వెళ్లడంతో సాగునీరు మళ్లించడం సాధ్యం కావడం లేదు. దీంతో పంటలను వేయలేకపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీడీ నాయుడు చానల్ ద్వారా మంగళాపురం, గోపాలపురం, అన్నవరం, అంపిలి, వడమ, కొండా పురంవరకు సుమారు వెయ్యి



ఎకరాలకు సాగునీరు సరఫరా కావల్సి ఉంది.

మంగళాపురం, బుక్కూరు, తంపటాపల్లి గ్రామాలకు సాగునీరు అందించే వెంకన్న చానల్‌కు కూడా నీరు మళ్లించడం కష్టమవుతుందని రైతులు వాపోతున్నారు. కాగా విజయనగరం జిల్లాలోని రేగిడి ఆమదాలవలస మండలం పరిధిలో సంకిలి, చిన్న పుర్లి, దేవుదల, కొమెర, ఆడవరం, లక్ష్మీపురం, ఖండ్యాం తదితర ప్రాంతాలకు నీరందించే సాయన్నచానల్ పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఇసుకను ఇష్టానుసారంగా తరలిస్తుండడంతో నదీ గర్భం లోతుగా మారి కాలువలు ఎత్తుగా మారుతుండడంతో సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

## బంగ్లాదేశ్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



**ఢాకా :** బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు గురువారం జరగనున్నాయి. 2024 ఆగస్టులో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించి ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆదేశాలకు వ్యతిరేకంగా యువత దేశవ్యాప్త నిరసనలు చేపట్టింది. ఈ నిరసనల్లో దాదాపు 15 వందల మంది చనిపోయారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి దేశం విడిచి వెళ్లిపోయారు. ఆ తర్వాత మొహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. దాదాపు సంవత్సరన్నర తర్వాత బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 50 శాతం పోలింగ్ బూత్‌ల వద్ద ఘర్షణలు జరిగే అవకాశం ఉంది. దీంతో పోలీసులు పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అలాగే ఆ దేశ రాజధాని ఢాకాలో పోలీసులు కెమెరాలు ధరించి భారీగా మోహరించారు. దాదాపు 90 శాతం బూత్‌లు సిసిటివిల పర్యవేక్షణలో ఉన్నాయని అధికారులు వెల్లడించారు.కాగా, ఈ ఎన్నికలు బంగ్లా దేశ ఎన్నికల చరిత్రలో ఇప్పటివరకు జరగని విధంగా జరగనున్నాయి. ఈ ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూసేందుకు భారీస్థాయిలో పోలీసులు మోహరించనున్నారు. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించనున్నామని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసుల్ని కోరామని ఎన్నికల కమిషనర్ అబ్దుల్ ఫజల్ మొహమ్మద్ సనావుల్లా తెలిపారు.రాజధాని ఢాకాలో 2,131 పోలింగ్ కేంద్రాల్లో.. 1,614 కేంద్రాలు హై రిస్క్‌గా ఉన్నట్లు గుర్తించామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బహరుల్ ఆలం అన్నారు. ఎన్నికలు నిష్పాక్షికంగా జరపడానికి దేశవ్యాప్తంగా దాదాపు 958,000 మంది పోలీసులు మోహరించినట్లు ఎన్నికల కమిషనర్ అబ్దుల్ ఫజల్ పేర్కొన్నారు.

# డయాబెటిస్ వచ్చేందుకు చాలా ఏళ్ల ముందే ఈ లక్షణాలు కనిపిస్తాయి..!



మన ఆరోగ్యంలో చిన్న చిన్న మార్పులు జరుగుతున్నప్పటికీ వాటిని మనం అంతగా పట్టించుకోం. కానీఈ మార్పులే కొన్నిసార్లు తీవ్ర అనారోగ్యాన్ని సూచిస్తాయి. లక్షణాలు కనబడకుండా చిన్న చిన్న మార్పులతో వచ్చే అనారోగ్య సమస్యల్లో డయాబెటిస్ ఒకటి. ఈ వ్యాధి చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. శక్తి స్థాయిలు తగ్గడం, నరాలు, చూపు, రోగనిరోధక శక్తిపై మొదటగా ప్రభావాన్ని చూపిస్తుంది. కానీ ఈ లక్షణాలను ఎవరూ పట్టించుకోరు. నిజానికి డయాబెటిస్ వచ్చే ముందు నుండే శరీరం మెటాబాలిక్ ఒత్తిడిని సూచించడం మొదలుపెడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం టైప్ 2 డయాబెటిస్ వచ్చే 13 సంవత్సరాల ముందు నుండే శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరగడం మొదలవుతుంది. అలాగే చిన్న వయసులో రోగనిరోధక శక్తిలో వచ్చే మార్పులు టైప్ 1 డయాబెటిస్‌ను సూచిస్తాయి. డయాబెటిస్ బారిన పడే ముందు మన శరీరంలో రోజువారి ఆరోగ్యంలో వచ్చే చిన్న చిన్న మార్పుల గురించి తెలుసుకుందాం.


డయాబెటిస్ నిర్ధారణకు ముందే గుండెపై ఒత్తిడి మొదలవుతుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ గుండె పనితీరును ప్రభావితం చేస్తుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, విశ్రాంతి తీసుకున్నప్పటికీ అలసటగా ఉండడం, మెట్లు ఎక్కేటప్పుడు శరీరం భారంగా అనిపించడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. చాలా మంది వీటిని పని ఒత్తిడి, వయసు పైబడడం వల్ల ఇలా జరుగుతుందని భావిస్తారు. అలాగే మెటబాలిక్ అసమతుల్యత కారణంగా నరాలలో, చర్మంలో మార్పులు వస్తాయి. పాదాలు, వేళ్లల్లో మంట, తిమ్మిర్లు రావడం, మెడ, చంకలు వంటి భాగాల్లో చర్మం నల్లగా మారడం, చర్మం పొడిగా, దురదగా ఉండడం వంటివి జరుగుతాయి. ఇవన్నీ కూడా చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందుతాయి. కనుక వీటిని ఎవరూ అంతగా పట్టించుకోరు. తద్వారా డయాబెటిస్ తీవ్రత పెరుగుతుంది.

రక్తంలో గ్లూకోజ్ నియంత్రణ సరిగ్గా లేకపోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుంది. తెల్లరక్తకణాల పనితీరు దెబ్బతింటుంది. దీంతో తరచూ యూరిన్ ఇన్ఫెక్షన్‌లు రావడం, దంతాలు, చిగుళ్ల ఇన్ఫెక్షన్‌లు రావడం, తరచూ ఫంగల్ ఇన్ఫెక్షన్ లు రావడం, చిన్న ఇన్ఫెక్షన్ లు కూడా ఆలస్యంగా తగ్గడం వంటివి జరుగుతాయి. ఇక గ్లూకోజ్ లో వచ్చే మార్పులు కంటిచూపుపై కూడా ప్రభావాన్ని చూపిస్తాయి.

కళ్లు మసకగా కనిపించడం, చూపులో మార్పు రావడం వంటివి జరుగుతాయి. స్క్రీన్ ఎక్కువగా చూడడం వల్ల ఇలా జరుగుతుందని అనుకుంటారు. కానీ శరీరంలో మెటబాలిక్ అసమతుల్యతల వల్ల కూడా ఇలా జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. కనుక శరీరంలో కనిపించే ఈ మార్పులను గుర్తించడం చాలా అవసరం.

లక్షణాలు మరీ ఎక్కువగా ఉంటే వైద్యుడిని సంప్రదించి ఫాస్టింగ్ గ్లూకోజ్, HbA1c వంటి రక్తపరీక్షలు చేయించుకోవాలి. జన్యుపరంగా డయాబెటిస్ వచ్చే అవకాశం ఉన్న వారు ఈ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. డయాబెటిస్ ప్రారంభ దశలో ఉన్నప్పుడే గుర్తించడం వల్ల చికిత్స, జీవనశైలిలో మార్పుల కారణంగా వ్యాధి తీవ్రత పెరగకుండా ఉంటుందని వైద్యులు సలహా ఇస్తున్నారు.

# మొటిమలతో బాధపడుతున్నారా?



మొటిమలు.. అమ్మాయిలు, అబ్బాయిలను సౌందర్యపరంగా ఇబ్బందిపెట్టే సమస్యల్లో ఇది ఫస్ట్ ప్లేస్‌లో ఉంటుంది. కాలుష్యం, శరీరంలో వేడి, అధిక సెబమ్ విడదల కావడం, హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపాలు, జన్యుపరమైన సమస్యలు వంటి కారణాల వల్ల మొటిమల సమస్య వేధిస్తూ ఉంటుంది. మొటిమల కారణంగా నొప్పి, వాపు కూడా బాధపెడుతూ ఉంటాయి. మొటిమలు, మొటిమల కారణంగా వచ్చే మచ్చలు, గుంతలు మన ముఖాన్ని అందవిహీనంగా మారుస్తాయి. మొటిమలు వచ్చిన తర్వాత.. రకరకాల రెమీడీస్‌తో వాటిమీద పోరడటం చేయడం కంటే.. అవి రాకుండా జాగ్రత్తపడటం చాలా మంచిది. మొటిమల సమస్యను శాశ్వతంగా దూరం చేయాలంటే.. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి. ప్రతి రోజు సరిపడా నీళ్లు తాగితే.. శరీరంల హైడ్రేటెడ్‌గా ఉంటుంది. మనం నీరు ఎక్కువగా తాగితే.. శరీరంలోని పేగులు, ఇతర అవయవాలు శుభ్రపడతాయి. అదేవిధంగా, చర్మంలోని మురికి, కాలుష్యం, టాక్సిన్స్ క్లీన్ అవుతాయి. దీంతో, పింపుల్స్ సమస్య పరిష్కారం అవుతుంది. నీరు ఎక్కువగా తాగడం వల్ల చర్మంలోని మృతకణాలు తొలగిపోయి చర్మం తాజాగా, ప్రకాశవంతంగా మారుతుంది. రోజూ కనీసం ఏడెనిమిది గ్లాసుల నీరు తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. మీ డైట్‌లోనూ.. సూప్‌లు, జ్యూస్‌లు వంటి ద్రవపదార్థఆలు ఎక్కువగా చేర్చుకోవడం మంచిది.

మీ చర్మాన్ని క్రమం తప్పకుండా ఎక్స్‌ఫోలియేట్ చేయడం మర్చిపోవద్దు. ఎక్స్‌ఫోలియేషన్ వల్ల చర్మ రంధ్రాల లోపల పేరుకున్న వ్యర్థాలు, కాలుష్య కారకాలను బయటకు పంపవచ్చు. మొటిమలు, నల్ల మచ్చలు వంటి చర్మ సమస్యలను నివారించవచ్చు. ఎక్స్‌ఫోలియేషన్ చనిపోయిన చర్మ కణాలను తొలగిస్తుంది, కొత్త చర్మ కణాల ఏర్పాటును ప్రోత్సహిస్తుంది, రక్తప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. మీ చర్మం తాజాగా, మెరుస్తూ ఉండటానికి కనీసం వారానికి ఒకసారైనా.. న్యాచురల్ స్క్రబ్‌తో చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయండి. ఇది మొటిమలనే కాదు.. ఇతర చర్మ సమస్యలను దూరం చేస్తుంది. మీ అందాన్ని రెట్టింపు చేయడానికి, మొటిమల సమస్యను నివారించడానికి మీరు తీసుకునే డైట్ సహాయపడుతుంది. మీ ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, నట్స్ ఎక్కువగా తీసుకోండి. నట్స్‌లో యాంటీ-ఏజింగ్ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అంతేకాదు వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఎ, ఇ, విటమిన్లు, ఒమేగా- 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. స్వీట్స్, జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, కూల్ డ్రింక్స్ తీసుకోకపోవడం మంచిది. ఇవి చర్మ సమస్యలను ప్రేరేపిస్తాయి. మనం ఆరోగ్యంగా ఉండటానికే కాదు.. మన అందాన్ని రెట్టింపు చేయడానికి వ్యాయామం సహాయపడుతుంది. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల హైపర్‌టెన్షన్, అధిక బరువు, ఒత్తిడి, చర్మ సమస్యలు దూరం అవుతాయి. ఒత్తడి, ఊబకాయం వల్ల వచ్చే.. మొటిమలను వ్యాయమంతో అదుపులో ఉంచుకోవచ్చు. ఎక్సఅర్‌సైజ్ చేయడం వల్ల మన శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. శరీరంలోని వ్యర్థాలు తొలగుతాయి. మన ఆరోగ్యానికి నిద్ర చాలా ముఖ్యం. నిద్ర చక్రంలో ఆటంకం ఏర్పడితే.. మన శరీర విధులు, కదలికలపై ప్రభావం పడుతుంది. రోజుకు కనీసం ఏడెనిమిది గంటల నిద్ర తప్పనిసరి. నిద్రలేమి విపరీతమైన ఒత్తిడి, ఆందోళనతోపాటు ఇతర సమస్యలకూ దారి తీస్తుంది. ఒత్తిడి పెరిగినప్పుడు సహజంగానే.. మొటిమలు రావడం స్టార్ట్ అవుతాయి. నిద్ర సరిగ్గా లేకపోతే.. త్వరగా వృద్ధాప్య ఛాయలు రావడం, కళ్లకింద వాపులు వంటి సమస్యలు కూడాఎదురవుతాయి. ఈ సమస్యలను నివారించడానికి ప్రశాంతంగా నిద్రపోవాలి.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందం... వాణిజ్య శాఖ కార్యదర్శి కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వాణిజ్య ఒప్పందాలలో, సున్నిత రంగాలపై భారతదేశం ఎల్లప్పుడూ స్పష్టమైన వైఖరితో చర్చలు జరిపిందని, అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలోనూ వ్యవసాయం సహా కీలక రంగాల ప్రయోజనాలను కాపాడేలా ముందుకు వెళ్లామని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వెల్లడించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

దేశానికి అత్యంత కీలకమైన రంగాలను దృష్టిలో ఉంచుకుని స్పష్టమైన వైఖరితోనే వాణిజ్య చర్చలు జరిపినట్లు తెలిపారు. అన్ని ఒప్పందాల విషయంలో ఇలా స్పష్టమైన వైఖరితోనే ఉన్నామని అన్నారు. మన రైతులు, మత్స్యకారులు, పాడిపరిశ్రమ సహా ప్రభావితమవుతాయని భావించిన రంగాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని రక్షించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

భారత్, అమెరికా ఉమ్మడి ప్రకటనను చట్టబద్ధమైన ఒప్పందంగా మార్చడానికి ఇరు దేశాలు పనిచేస్తున్నాయని, మార్చి నెలాఖరు నాటికి దీనిని ఖరారు చేసి సంతకాలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఒప్పందాలలో సున్నితమైన రంగాలకు రక్షణ కల్పించామని, అంతగా సున్నితం కానటువంటి రంగాల విషయంలో మాత్రం మన మార్కెట్‌ను తెరిచేందుకు సుంకాలను ఉపయోగించామని తెలిపారు. కీలకమైన మన ఉత్పత్తులు ఉన్న రంగాల్లో మాత్రం మార్కెట్ ఇవ్వలేమని అమెరికాకు స్పష్టం చేశామని అన్నారు.

# ఎన్‌పిసిఐఎల్ చేపట్టే 'సీఎస్ఆర్' వెనుక మతలబు ఏమిటో?



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** మహా భారతంలో ధృతరాష్ట్ర కౌగిలి గురించి విన్నారా ....శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్) చేపడుతున్న వివిధ కార్యక్రమాలతో స్థానికులకు అటువంటి పరిస్థితే ఏర్పడుతోంది. తాజాగా ఆ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సిఎస్ఆర్) కింద స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. రణస్థలం మండలం అర్జునవలసలో ఆ సంస్థ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఐదెకరాల స్థలాన్ని ఇచ్చేందుకు అంగీకరించింది. రణస్థలం మండలంలోని కొవ్వాడలో అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుండటం, దానిని స్థానికులు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అణు అజెండాను పూర్తి చేయడానికే ఎన్‌పిసిఐఎల్ స్థానిక ప్రజలను మచ్చిక చేసుకునే ఈ తరహా కార్యక్రమాలను చేపడుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వెయ్యి మందికి పలురకాల ఉపాధి కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. శిక్షణ సంగతి ఎలా ఉన్నప్పటికీ స్థానిక యువకులను సానుకూలంగా మార్చుకోవడమే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ లక్ష్యమని సమాచారం. నిజానికి కొవ్వాడలో ప్రతిపాదించిన అణు విద్యుత్ ప్లాంట్‌కు స్థానిక ప్రజల నుండి వ్యతిరేకత రావడంతో కేంద్ర ప్రభుత్వం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్)ను వ్యూహాత్మకంగా రంగంలోకి దించింది. ప్లాంటు నిర్మాణంలో కూడా కీలక పాత్ర పోషించనున్న ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగీదిగగానే స్థానికులకు తాయిలాలు ఇవ్వడం ప్రారంభించింది. 2024వ సంవత్సరం నుండే ప్రారంభమైన ఈ ప్రక్రియ ఇప్పుడు మరింత జోరందుకుంది. సాధారణంగా ఒక పరిశ్రమ లేదా సంస్థ ఏర్పాటై లాభాలు ఆర్జించిన తర్వాత కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సిఎస్ఆర్) కింద వివిధ రకాల కార్యక్రమాలు చేపడతాయి. అయితే, అణువిద్యుత్ ప్లాంట్ పనులు కూడా ప్రారంభం కాకముందే ఎన్‌పిసిఐఎల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి పేరుతో స్థానికులను సంతృప్తి పరిచే కార్యక్రమాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. 2024 నవంబర్‌లోనే రణస్థలం, లావేరు మండలాల్లోని అన్ని పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లను ఎన్‌పిసిఐఎల్ అందించింది. వీటన్నింటిపైనా తమ సంస్థ పేరును ముద్రించి వాటిని ఒక కిట్‌గా సంచిలో పెట్టి పంపిణీ చేయడం అప్పట్లో కలకలం రేపింది. ఆ తరువాత కూడా ఈ తరహా కార్యక్రమాలను ఆ సంస్థ కొనసాగించింది. వీటితోపాటు రణస్థలం మండలం కొవ్వాడలోని ప్రాథమిక పాఠశాలలోని అదనపు తరగతి గదుల కోసం సిఎస్ఆర్ కింద రూ.74 లక్షలు అందించింది. కొవ్వాడలో 1300 సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసేందుకు రూ.3.42 కోట్లను పంపిణీ చేసింది. కొవ్వాడలో తాగునీటి కోసం రూ.20 లక్షలు అందించింది. తాజాగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు పనులను వేగవంతం చేస్తోంది.

కొవ్వాడ అణు విద్యుత్కేంద్రానికి భూ సేకరణ కోసం గతంలో ప్రత్యేకంగా భూ సేకరణ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీని కొనసాగింపునకు లేఖ పంపాలంటూ ప్రత్యేక భూపరిపాలన కమిషనర్ తాజాగా ప్రతిపాదనలు కోరినట్లు తెలిసింది. అణువిద్యుత్కేంద్రానికి భూ సేకరణ చేయాల్సిన అవసరమున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ యూనిట్‌ను కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం. కొవ్వాడ భూములు, నిర్వాసితుల కాలనీ అంశాలపై ఇటీవలి రెండు పర్యాయాలు సమీక్షించారు. దీంతో, అణువిద్యుత్కేంద్రం ఏర్పాటు విషయంలో మళ్లీ కదలిక వచ్చినట్లుగా చర్చ నడుస్తోంది.




# రూ. 1560 కోట్ల భారీ లాస్ నుంచి తప్పించుకున్న ఐసీసీ



టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఫిబ్రవరి 15న టీమ్ఇండియాతో జరగబోయే మ్యాచ్‌ను ఆడబోమని తొలుత బెట్టు చేసిన పాకిస్థాన్ ఆ తర్వాత దారికొచ్చింది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలన్న తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పాక్ సర్కార్ సోమవారం వెల్లడించింది. చర్చల ద్వారా వచ్చిన ఫలితంతో సంతృప్తి చెందడంతో పాటు మిత్ర దేశాలు విజ్ఞప్తి చేయడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ జట్టుకు అనుమతిని ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) భారీ నష్టాన్ని చవిచూసే ముప్పు నుంచి తప్పించుకుంది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో ఈనెల 15న భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో ఆడబోమని తొలుత ప్రకటించిన పాక్, ఆ తర్వాత ఆడతామని తెలిపింది. అయితే టోర్నీలోనే హై వోల్టేజ్ మ్యాచ్ ఇది. మిగిలిన మ్యాచ్‌ల కంటే దాయాదుల పోరుతోనే ఐసీసీ, ఆతిథ్య దేశం, బ్రాడ్‌కాస్టర్ తదితర విభాగాలకు భారీ ఆదాయం సమకూరుతుంది. అయితే పాక్ ఈ మ్యాచ్ ఆడబోమని ప్రకటించిన తర్వాత భారీ నష్టం తప్పదేమో అని అంతా భావించారు. కానీ పాక్ తాజా డెసిషన్‌తో ఐసీసీ భారీ నష్టం నుంచి తప్పించుకుంది. భారత్, పాక్ మ్యాచ్ జరగకపోతే అధికారిక ప్రసారదారు జియోస్టార్‌కు నష్టం వాటిల్లుతుంది. వ్యాపార ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని జియోస్టార్ కోల్పోతుంది.

అలాగే గేట్ మనీ (టికెట్ అమ్మకాలు), స్పాన్సర్‌షిప్స్ వంటి వాటిలో నష్టపోతుంది. దీంతో ఐసీసీని జియోస్టార్ రిబేట్ అడిగే అవకాశం ఉంది. అయితే భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు పాక్ ఓకే చెప్పడంతో ఐసీసీ 174 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీ ప్రకారం రూ. 1560 కోట్లు) నష్టం నుంచి తప్పించుకున్నట్లు తెలుస్తోంది. భారత్‌తో మ్యాచ్ ఆడే విషయమై కొన్ని రోజులపాటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ), ఐసీసీ మధ్య చర్చలు జరిగాయి. భారత్‌తో మ్యాచ్ బహిష్కరణ నిర్ణయంపై పునరాలోచించాలని శ్రీలంక, ఎమిరేట్స్ బోర్డులు పీసీబీని విజ్ఞప్తి చేశాయి. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పాకిస్థాన్‌కు తాను కోరినట్లు బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లామ్ వెల్లడించారు. అలాగే క్రీడా స్ఫూర్తి దృష్ట్యా మ్యాచ్ ఆడాలని బీసీబీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ తర్వాత వెంటనే పాక్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో మ్యాచ్‌లో ఆడనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం వెలువడిన కొద్ది సేపటికే భారత్‌లో టీ20 ప్రపంచకప్ ఆడేందుకు తిరస్కరించినందుకు బంగ్లాదేశ్‌పై ఎలాంటి ఆంక్షలు, జరిమానాలు విధించబోమని ఐసీసీ తెలిపింది.

కాగా, ఫిబ్రవరి 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో హై వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. భారత్, పాక్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎప్పటిలాగే దాయాది దేశంపై గెలుపొంది పైచేయి సాధించాలని టీమ్ఇండియా ఉవ్విళ్లూరుతోంది. భారత్‌కు షాక్ ఇవ్వాలని పాక్ యోచిస్తోంది. దీంతో ఇరు జట్ల పోరుపై తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్, భారత్ తాము ఆడినా తొలి మ్యాచ్‌ల్లో గెలిచి మంచి ఊపు మీద ఉన్నాయి. తన తొలి మ్యాచ్‌లో పసికూన నెదర్లాండ్స్‌ను పాకిస్థాన్ ఓడించింది. నెదర్లాండ్స్ విధించిన 148 పరుగుల లక్ష్యాన్ని 19.3 ఓవర్లలో 7 వికెట్ల కోల్పోయి ఛేదించింది. ఒకానొక దశలో పసికూన నెదర్లాండ్స్ పాకిస్థాన్‌కు షాక్ ఇస్తుందా అన్న విధంగా ఈ మ్యాచ్ సాగింది.

## ఒకే మ్యాచ్‌లో రెండు సూపర్ ఓవర్లు.. థ్రిల్లింగ్ పోరులో ఆఫ్ఘన్‌పై సఫారీల గెలుపు



క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన, ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచిపోయే పోరులో దక్షిణాఫ్రికా అద్భుత విజయం సాధించింది. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫలితం కోసం ఏకంగా రెండు సూపర్ ఓవర్లు ఆడాల్సి వచ్చింది. చివరికి, రెండో సూపర్ ఓవర్‌లో 5 పరుగుల తేడాతో గెలిచిన సఫారీ జట్టు ఊపిరి పీల్చుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో చివరి బంతి వరకు ఇరు జట్ల ఆటగాళ్లు కనబరిచిన పోరాట పటిమ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. రెండో సూపర్ ఓవర్‌లో ఆఫ్ఘనిస్థాన్ విజయానికి 24 పరుగులు అవసరమవ్వగా, ఆ జట్టు బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్... సఫారీ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో వరుసగా మూడు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో సమీకరణం చివరి బంతికి 6 పరుగులుగా మారింది. ఈ దశలో మహరాజ్ విసిరిన వైడ్ బాల్‌తో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. అయితే, చివరి బంతికి గుర్బాజ్ భారీ షాట్‌కు యత్నించి మిల్లర్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆఫ్ఘన్ పోరాటం ముగిసింది. అంతకుముందు, ఈ సూపర్ ఓవర్‌లో మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా డేవిడ్ మిల్లర్ (2 సిక్సర్లు) చెలరేగడంతో వికెట్ నష్టపోకుండా 23 పరుగులు చేసింది.

వాస్తవానికి, ఈ మ్యాచ్‌లో తొలి సూపర్ ఓవర్ కూడా టైగా ముగియడంతోనే రెండో సూపర్ ఓవర్ అనివార్యమైంది. తొలి సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్ 17 పరుగులు చేయగా, ఛేదనలో సఫారీలకు చివరి బంతికి 6 పరుగులు అవసరమయ్యాయి. ఫజల్‌హక్ ఫరూఖీ బౌలింగ్‌లో ట్రిస్టన్ స్టబ్స్ సిక్సర్ బాదడంతో స్కోర్లు సమం అయ్యాయి. దీంతో క్రికెట్ అభిమానులు మరో అరుదైన ఘట్టానికి సాక్షులుగా నిలిచారు. అంతకుముందు, ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 187 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్ (59), ర్యాన్ రికెల్టన్ (61) అర్ధ సెంచరీలతో రాణించారు.




# 'రౌడీ జనార్దన'తో కీర్తి సురేశ్ సందడి



హీరోయిన్ గా ఛాన్స్ రావడమే కష్టం .. ఇక ఆ సినిమా హిట్ కొట్టేసి స్టార్ డమ్ దక్కడం మరింత కష్టం. అయితే ఈ విషయంలో కీర్తి సురేశ్ పెద్దగా కష్టపడలేదు. చాలా తేలికగా ఆమె వరుస విజయాలను అందుకుంటూ వెళ్లింది. స్టార్ హీరోయిన్ గా చక్రం తిప్పడం మొదలుపెట్టేసింది. అయితే మొదటి నుంచి కూడా ఆమె తమిళ సినిమాలకి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం మనకి కనిపిస్తుంది. ఈ కారణంగా తెలుగు ప్రాజెక్టులపై పెద్దగా శ్రద్ధ పెట్టలేదు.

కీర్తి సురేశ్ ప్లానింగ్ కారణంగా తెలుగులో గ్యాప్ లేకుండా చేయలేకపోయింది. 'దసరా' తరువాత ఆమె తెలుగులో పెద్దగా సినిమాలు చేయలేకపోయింది. తమిళంలో మాత్రం ఆమె మార్కెట్ బాగానే ఉంది. తెలుగులో ఆమె ప్రాజెక్టులు .. నిర్ణయాల విషయంలో అభిమానులు మాత్రం కాస్త అసంతృప్తిగానే ఉన్నారు. ఆమె నుంచి సరైన సినిమా రాలేదనే అభిప్రాయంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె విజయ్ దేవరకొండ జోడిగా 'రౌడీ జనార్దన' సినిమాను ఒప్పేసుకుంది.

విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేశ్ తొలిసారిగా చేస్తున్న సినిమా కావడంతో, ఈ ప్రాజెక్టుకి ఒక్కసారిగా బజ్ వచ్చేసింది. తెరపై ఈ జోడీ చాలా బావుంటుందని ఫ్యాన్స్ అంటున్నారు. అటు విజయ్ దేవరకొండకి .. ఇటు కీర్తి సురేశ్ కి కూడా ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ ఇస్తుందని నమ్ముతున్నారు. ఇక ఈ సినిమాలో రాజశేఖర్ ఓ కీలకమైన పాత్రను చేయనున్నారని అంటున్నారు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా, డిసెంబర్లో థియేటర్లకు వచ్చే ఛాన్స్ ఉందని చెబుతున్నారు.

# 'రేజర్' షూటింగ్ పూర్తి




విలక్షణ నటుడు, దర్శకుడు రవిబాబు కొత్త చిత్రం 'రేజర్' షూటింగ్ పూర్తయినట్టు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సినిమాలోని క్రూరమైన యాక్షన్ థీమ్‌ను తెలియజేస్తూ ఓ ప్రత్యేక గ్లింప్స్ వీడియో, పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ వీడియోలో రవిబాబు అత్యంత హింసాత్మక అవతారంలో కనిపించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు.

విడుదలైన గ్లింప్స్‌లో, కారు ఇంజిన్ వాల్వ్ కవర్‌తో ఓ విలన్‌ను దారుణంగా చంపే సన్నివేశం సినిమాలోని రా అండ్ శావేజ్ టోన్‌ను స్పష్టం చేస్తోంది. "జస్టిస్ విల్ బీ బ్రూటల్" (ఈ న్యాయం క్రూరంగా ఉంటుంది) అనే ట్యాగ్‌లైన్‌తో ఈ యాక్షన్ డ్రామా రాబోతోంది. తెలుగు సినిమాలో ఇదో సరికొత్త ప్రయత్నమని చిత్ర యూనిట్ చెబుతోంది.

ఈ చిత్రంలో రవిబాబు కథానాయకుడిగా నటించడమే కాకుండా దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. తన గత చిత్రం 'ఏనుగుతొండం ఘటికాచలం'కు పూర్తి భిన్నంగా ఈ సినిమాను ఉత్కంఠభరితమైన, హింసాత్మక నేపథ్యంలో తెరకెక్కించారు.

ప్రముఖ నిర్మాత సురేష్ బాబు తన సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని సమర్పిస్తుండగా, ఫ్లయింగ్ ఫ్రాగ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి వాద్వనేని సినిమాటోగ్రాఫర్‌గా, ఎస్ఎస్ రాజేష్ సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలను సతీష్ పోలోజు కొరియోగ్రఫీ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఈ వేసవిలోనే 'రేజర్' చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకువస్తామని నిర్మాతలు తెలిపారు.

# 14న థియేటర్స్‌కు వస్తున్న 'సీతా పయనం'



స్టార్ హీరోల వారసుల పిల్లలు హీరోలుగా తమ జోరు చూపించడం చాలా కాలం నుంచి ఉన్నదే. అయితే స్టార్ హీరోల కూతుళ్లు మాత్రం హీరోయిన్ కావాలనే ఆలోచన చేసేవారు కాదు. అందుకు అనేక కారణాలు కనిపిస్తాయి. అయితే అలాంటి కాలం గతంలోకి జారిపోయి చాలాకాలమే అవుతోంది. సీనియర్ స్టార్ హీరోల కూతుళ్లు హీరోయిన్స్ గా తెరపై సందడి చేయడానికి ఉత్సాహాన్ని కనబరుస్తూ వస్తున్నారు.

అలాంటి హీరోయిన్స్ జాబితాలో ఇప్పుడు అర్జున్ కూతురు ఐశ్వర్య కూడా చేరిపోయింది. ఐశ్వర్య 2013లోనే ఎంట్రీ ఇచ్చింది. అయితే కెరియర్‌ను ఆమె సీరియస్ గా తీసుకున్నట్టుగా కనిపించలేదు. తమిళ .. కన్నడ భాషల్లో మాత్రమే రెండు మూడు సినిమాలు చేసిన ఆమె, ఇప్పుడు 'సీతా పయనం' అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నెల 14వ తేదీన ఈ సినిమాను భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. ఇది ప్రేమకథా చిత్రం .. ఈ సినిమాకి అర్జున్ దర్శకత్వం వహించడం విశేషం. తండ్రి దర్శకత్వంలో లవ్ స్టోరీస్ చేయవలసి రావడం నిజానికి కాస్త ఇబ్బందిని కలిగించే విషయమే. అయినా అర్జున్ ను ఒక దర్శకుడిగా మాత్రమే భావిస్తూ ఐశ్వర్య ఈ సినిమా చేసింది. గ్లామర్ పరంగా ఐశ్వర్యకి వంక బెట్టాల్సిన అవసరం లేదు. మరి నటన పరంగా ఎన్ని మార్కులు పడతాయనేది చూడాలి. అర్జున్ చాలా కసరత్తు చేసి తీసిన ఈ సినిమా, ఎలాంటి ఫలితాన్ని రాబడుతుందనేది చూడాలి.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**